నిరాశలో కంది రైతులు

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కూటమి ప్రభుత్వం విఫలం
- గత ప్రభుత్వంలో కన్నా క్వింటా ధర రూ.3 వేలు పతనం
- ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి తగ్గిందంటున్న రైతులు

దుర్గి: అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా నేడు కంది పంట పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు మార్కెట్‌లో కందిపప్పు కేజి రూ.160కి పైగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు ఇబ్బందిగా మారింది. కానీ అవే కందులు పండించే రైతుల నుంచి క్వింటా రూ.6 వేల నుంచి రూ.6500కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.దీంతో కంది రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరను రూ.7,550గా నిర్ణయించాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు విస్మరించటం బాధాకరం.


కల్లాల్లో ఆరబోసిన కందులు

■ మండలంలో ప్రధాన పంటగా కంది పంట సుమారు 15 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు. గంపెడు ఆశలతో వ్యయ ప్రయాసలకోర్చి పంట చేతికొచ్చిన సమయానికి ధరలు పతనం కావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం మొదట్లో సమయానికి అనుకూలంగా వర్షాలు పడటంతో దిగుబడులు అధికంగా వస్తాయని రైతులు ఆశించారు. అయితే గత నెలలో ఆకాశం మేఘావృతం కావడం, స్వల్ప జల్లులు, తుపాను ముసురు పట్టడంతో కందిలో పూత, పిందె రాలిపోవటంతో దిగుబడులు సగానికి సగం తగ్గిపోయాయి. దీంతో ఇటు దిగుబడి అటు ధర ఆశాజనకంగా లేక రైతులు ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో క్వింటా రూ.10 వేలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతు భరోసా కేంద్రంలో కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక వ్యవసాయ సిబ్బందితో క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేసి నగదును రైతుల ఖాతాలలోనే నేరుగా వారంలోపే ప్రభుత్వం జమ చేసింది. నేడు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో విమర్శల పాలవుతుంది. గత ప్రభుత్వం రైతుల నుంచి కందులను కొనుగోలు చేయటంతో వ్యాపారస్తులు కూడా ప్రభుత్వం కల్పించిన ధరకు అదనంగా కొనుగోలు చేసినట్లు రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పతనమవుతున్న కంది ధరలను నిలువరించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

లాభం రాకపోగా.. నష్టం వస్తుంది



గంపెడు ఆశలతో ఐదు ఎకరాలలో కంది పంటను సాగు చేశాను. గత సంవత్సరంలో మంచి ధర లభించటంతో మూడు ఎకరాలు అదనంగా పంట సాగు చేశాను. నేడు పంట చేతికి వచ్చేసరికి స్థానిక మిల్లర్లు తేమ అధికంగా ఉందంటూ రూ.6500కు కొనుగోలు చేస్తామని తెలుపుతున్నారు. ఈ ధర అయితే మాకు లాభం రాకపోగా నష్టం వస్తుంది.

– పుచ్చకాయల రామకృష్ణ, రైతు, తేరాల


దిగుబడులు తగ్గాయి



ఈ ఏడాది తుపానులు అధికంగా రావటంతో ముసురు పట్టి కంది పూత, పిందె రాలిపోవటంతో దిగుబడులు బాగా తగ్గాయి. ప్రస్తుతం పంట చేతికి వచ్చి కల్లాల్లో ఆరబోశాం. పూర్తిగా ఆరుదల అయిన తరువాత మిల్లుకు తీసుకువెళితే క్వింటా ధర రూ.6 వేలు మాత్రమే అని చెబుతున్నారు. ఏమి చేయాలో తోచటం లేదు.

–ఎం.మధునాయక్, రైతు, మంగాపురం తండా

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,550 అమలు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి నేరుగా కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని చెప్పటం కాకుండా చేతల ద్వారా చూపించి కంది రైతులను ఆదుకోవాలి. ప్రస్తుతం కంది నూర్పులు ప్రారంభమయ్యాయి. ఇలాంటి సమయంలో ఆలస్యం చేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి.

– శెట్టిపల్లి యలమంద, జెడ్పీటీసీ సభ్యులు, దుర్గి

క్లుప్తంగా

ఎన్ ఫ్యూషన్ ఫెస్ట్ పేరుతో సంక్రాంతి సంబరాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం ఎన్ ఫ్యూషన్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిల్డ్రన్స్ డే, మ్యాథ్స్ డే, క్రిస్మస్ డే, ఫార్మర్స్ డే, సంక్రాంతి సంబరాలు అన్నిటిని కలిపి ఒకే వేదికగా ఎన్ ఫ్యూషన్ ఫెస్ట్ పేరుతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులలో ట్యాలెంట్‌ను వెలికి తీసి వారికి ఇష్టమైన రంగాల్లో ఎదిగే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ఫెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జోన్ ఏజీఎం లక్ష్మణ రెడ్డి, ఆర్ఐ హుస్సేన్, మద్దిరెడ్డి, గౌసియా, రీహానా, ప్రిన్సిపాల్ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంతారావు సేవలు అమూల్యం

ఎంఈఓ 2 అల్లి సురేష్



మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి కాంతారావు చేసిన సేవలను ఈ ప్రాంత ప్రజలు మరువలేరని మండల విద్యా శాఖాధికారి-2 అల్లి సురేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ నిర్వహించిన సంస్మరణ సభలో మాట్లాడారు. వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసే వారన్నారు. విజయపురిసౌత్ ప్రభుత్వ హైస్కూల్‌లో పనిచేస్తున్న సమయంలో విద్యార్థులకు క్రమశిక్షణ, క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో పాటు, తోటి ఉపాధ్యాయులతో స్నేహపూరిత ధోరణిలో వ్యవహరించే ఆయన తీరు పలువురికి ఆదర్శమన్నారు. హెచ్ఎం రామారావు మాట్లాడుతూ నిబద్ధతతో కూడిన బోధన అందిస్తూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వారధిగా పనిచేసిన ఆయన తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్‌బాబు, కొరటా కోటేశ్వరరావు, ఎక్స్‌మస్ జాన్, ఏడుకొండలు, పిచ్చయ్య, డేవిడ్ విల్సన్ తదితరులున్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించండి



మాచర్ల రూరల్: గ్రామాలలో వలసల నివారణ కోసం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు అందేలా సిబ్బంది పనిచేయాలని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు అందించాలని, అలాగే గ్రామాలలో ఉపాధి హామీ పనుల నిర్వహణ కోసం క్షేత్రస్థాయిలో పరిశోధన జరిపి పనుల అంచనాలను రూపొందించి వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయాలని సూచించారు. ఏ గ్రామంలోనూ వలసలు ఉండకూడదని, మాకు పనిలేదు, ఆర్థిక ఇబ్బంది వస్తుంది అనే మాట లేకుండా పక్కా ప్రణాళికతో ఉపాధి హామీ పనుల నిర్వహణ చేపట్టాలని ఆయన సూచించారు. రైతు కూలీలకు పొలం గట్లు, చెరువులు, మట్టి పనులు చూపాలని వ్యవసాయ పంటలకు ప్రత్యామ్నాయంగా మనం అందిస్తున్న ఉద్యానవన పంటల రాయితీలను వివరించి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్, ఏపీఓలు తోట నాగ శ్రీనివాస్, గంగనబోయిన చిన వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు తదితరులున్నారు.

దివ్యాంగ పింఛన్ల పరిశీలన



పిడుగురాళ్ల: పట్టణంలోని 33 వార్డుల్లో ఉన్న దివ్యాంగ పింఛన్లను మంగళవారం ప్రత్యేక వైద్య బృందం ప్రతి పింఛన్‌దారును కలిసి వారి వైద్య రికార్డులను పరిశీలించారు. పట్టణంలోని 31 దివ్యాంగ పింఛన్లను ప్రత్యేక వైద్య బృందం డోర్ టూ డోర్ తిరిగి క్షుణ్నంగా పరిశీలించారు. హెల్త్ పింఛన్లు పొందుతున్న వారికి పింఛన్ పొందే అర్హత ఉందా లేదా అనే కోణంలో ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి గతంలో చికిత్స పొందిన రిపోర్టులను పరిశీలించారు. నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు ఈ ప్రత్యేక వైద్య బృందం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ వైద్యులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగార్జునతోపాటు పిడుగురాళ్ల పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్, ఆయా వార్డుల సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న సంక్రాంతి ముగ్గుల పోటీలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన మహిళలు ఈ నెల 10వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి 32 ఇంచెస్ కలర్ టీవీ, రెండవ బహుమతి వాషింగ్ మిషన్, మూడవ బహుమతి మిక్సర్ గ్రైండర్‌ను అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకై ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు వెంకట సుబ్రహ్మణ్యం 9848420549, కొత్త హనుమంతరావు 8096498233లను సంప్రదించాలని కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామ శివారులో ఉన్న పంట పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సి.హెచ్.నాగార్జున మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9 వేల నగదు తోపాటు, 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యకే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల: కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకే మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నోటు పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసి మాట్లాడారు. నూతన పాఠశాల, వసతి గృహాల నిర్మాణం కోసం ఫేజ్–1 కింద రూ.4.5 కోట్లు అంచనాలు వేయడం జరిగిందన్నారు. మిట్టగుడిపాడు గ్రామ శివారులో భవనాల నిర్మాణానికి భూమి కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వాటి వలన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, ముఖద్వారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర శిల్పకళారామ సంస్థ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి

చైర్మన్ చేరెడ్డి మంజుల, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ బి.రామకృష్ణ, నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి, శింతిరెడ్డి నర్శిరెడ్డి, మున్నా ప్రభురాజు, గొంటు ఆదిరెడ్డి, పోట్ల సతీష్, కావూరి నాగయ్య, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, మర్రి రాజ్‌కుమార్, మూలి రాజారెడ్డి తదితరులున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి


మిరప పంట పరిశీలించి మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు


కొత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ లక్ష్మారెడ్డి

మాచర్ల రూరల్: పత్తి పంట చివరి దశలో ఉండి మంచు కురిసే వేళలో కాకుండా ఎండ వచ్చిన తరువాత పత్తిని విరుచుకోవాలని పైరులో తగిన కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కె.లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కంది పైరు పిందె దశలో ఉన్న పైరుపై శనగ పచ్చ పురుగు వస్తుందని, దీని నివారణకు క్లోరిఫైరిపాస్ మందును పిచికారీ చేసుకోవాలని, అలాగే కొంత మేరకు వరి నారు మడులు వేసిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని 20 నుంచి 30 రోజుల నారును వేసుకోవటం మంచిదని తెలిపారు. చ.మీ. కనీసం 40 దుబ్బులు ఉండేలా నాటుకోవాలని సూచించారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించే సమయంలో వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అభిషిక్త వర్మ, సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

మాచవరం: మండలంలోని చెన్నాయిపాలెం, రేగులగడ్డ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిడుగురాళ్ల ఏడీఏ బి.కృష్ణదేవరాయలు హాజరై పత్తి, మిరప పంటలను పరిశీలించి రైతులకు వివిధ యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి రైతుల సమస్యలను నివృత్తి చేశారు. మిరప పంటలో నీలిరంగు, పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు ఎం.గోపి, సీహెచ్ వంశీ, ఎం.నర్సయ్య, మాజీ సర్పంచ్ బి.అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు చెస్ అకాడమీ సేవలు అమూల్యం

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో చదరంగం క్రీడను విద్యార్థులకు నేర్పిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీస్తున్న పల్నాడు చెస్ అకాడమీ చైర్మన్, కోచ్ కె.కిరణ్‌కుమార్ సేవలు అమూల్యమని స్థానిక శ్రీ కృష్ణ జనరల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కోదండ రామాలయంలో పల్నాడు చెస్ అకాడమీ, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ నేతృత్వంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని క్రీడల కంటే చెస్ ఎంతో విలువైనదని, కొన్ని క్రీడలు శారీరక ఎదుగుదలకు ఉపయోగపడితే చెస్ మాత్రం మెదడు ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, దీనిని మైండ్ గేమ్ అంటారని అన్నారు. ఒకప్పుడు ఉన్నత వర్గాలే ఆడే క్రీడను అట్టడుగు వర్గాలు సైతం ఆడే విధంగా అందుబాటులోకి తీసుకొచ్చి పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో అందిస్తూ


చెస్ పోటీలో గెలుపొందిన చిన్నారి మ్యాగ్నస్‌తో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

వారిలోని ప్రతిభను బయటకు తీసేందుకు క్రమం తప్పకుండా టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్న చెస్ కోచ్ కిరణ్ కృషి అమూల్యమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భవనాసి రవితేజ, జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, అంజి, సభ్యులు మేడం నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు తదితరులున్నారు.

10న సీజీజీ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో నూతనంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, దుర్గి బ్రాంచిని ఈ నెల 10న శుక్రవారం ప్రారంభించనున్నట్లు బ్రాంచి మేనేజర్ వడ్డీ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

గతంలో దుర్గిలో కేవలం అడిగొప్పల, ముటుకూరు బ్రాంచిలు మాత్రమే ఉండి కార్యకలాపాలు కొనసాగించేవన్నారు. బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్‌లు పి.మారుతిరాం, పి.వీరారెడ్డి, రీజనల్ మేనేజర్ ప్రహరాజు సుభాష్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. దుర్గి పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న బ్రాంచిని ప్రజలు, వ్యాపారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనస్తాపంతో వ్యక్తి మృతి


మృతి చెందిన రెంటపాళ్ల కృష్ణ

పిడుగురాళ్ల: మనస్తాపంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని గాంధీనగర్ 1వ లైన్‌లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌కు చెందిన రెంటపాళ్ల కృష్ణ (బండి కృష్ణ) (43) తన ఇంట్లో ఫ్యాన్‌కి లుంగీతో ఉరివేసుకొని మృతి చెందాడు. మంగళవారం ఇరుగుపొరుగు వారు చూసి సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించటం జరిగిందన్నారు. కృష్ణకు గత 18 ఏళ్ల క్రితం వివాహం అయింది. ఐదేళ్ల నుంచి భార్యభర్తలు సఖ్యతగా ఉండకపోవటంతో మనస్పర్థలు వచ్చి సత్తెనపల్లి వద్ద నందిగామలో భార్య ఉంటోంది. ఈ నేపథ్యంలో కృష్ణ ఉరివేసుకొని చనిపోయాడు. వృత్తిపరంగా పెయింటర్‌గా చేసుకుంటూనే క్రికెట్‌పై మక్కువతో మంచి ఆటగాడిగా, క్రికెట్ కీపర్‌గా పట్టణంలో పేరు సాధించాడు. ఘటనపై పట్టణ ఏఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లను పూర్తి చేసి నిరుపేదలకు వెంటనే అందించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఇచ్చిన హామీలు ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలాలు ఇస్తామని, వాటి నిర్మాణం కోసం రూ.5 లక్షల రుణం అందిస్తామని చెప్పిన హామీలను వెంటనే నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, మాటకు కట్టుబడి ఉండటమే తమ లక్ష్యమని ప్రగల్భాలు పలికే పార్టీ నాయకులు, ఆ తరువాత మాట మార్చటం అలవాటుగా మారిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం బాధితుల తరఫున చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గురజాల : పల్నాడు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు సముదాయంలో గురజాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నేటి నుంచి మూడు రోజుల పాటు విధులు బహిష్కరించడం జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరు కోర్టుకు చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పట్టణ సీఐ, ఎస్ఐ, సిబ్బంది అమానుషంగా చిత్రహింసలకు గురిచేసి తీవ్రంగా గాయపరచి న్యాయవాదులను అసభ్య పదజాలంతో దూషించి, తప్పుడు కేసులు నమోదు చేసినందుకు నిరసనగా విధులు బహిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గురజాల బార్ అసోసియేషన్ సభ్యులు చల్లా రామిరెడ్డి, శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, కె.వి.నాగార్జున బీఎన్‌వీ హనుమంతరావు, కర్రా చిన కోటేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు, కలివెల ప్రభుదాసు, దుగ్గరాజు అనంతరామయ్య షేక్ జానీ బాషా,


కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కనకం ఆదినారాయణ, కొంగర హరిసత్యనారాయణ, ఆచంట శ్రీనివాసరావు, పి.హుస్సేన్ ఖాన్, జక్కా చెన్న కేశవరావు, బి.సుందర జ్ఞానమ్మ, ఎస్ శ్యామలాదేవి, డి.లింగరాజు, ఎం.ప్రసాదరావు, కె.రామకృష్ణ, కె.చలమరాజు, సీహెచ్ సురేష్, వై.నరసింహారెడ్డి, పి.సురేష్, చల్లా తిరుమలేశ్వరరావు షేక్ సైదా వలి, కె.మణిదీప్, జె.అనిల్, వి.గురు ప్రసాద్, నాగూర్ మస్తాన్, నాగలక్ష్మి ఝాన్సీ, మణికంఠ, అనిల్ ఉన్నారు.

ప్రారంభమైన వరి నాట్లు


వరి నారుమడులు

కారెంపూడి: మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే నారు పోసి నెల రోజులు అయిన రైతులు నాట్లు వేయిస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో వరి నాట్లు ఊపందుకునే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రైతులు నాటు వేసే కూలీల అన్వేషణలో పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి పనుల కోసం రైల్వే స్టేషన్లలో దిగిన కూలీల దగ్గరకు రైతులు వెళ్లి పనులు కల్పిస్తామని భరోసా కల్పించి గ్రామాలకు తీసుకొచ్చి వారికి వసతి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో వలస కూలీల సందడి నెలకొంది. మండలంలో ఉన్న కూలీలు వరి నాట్ల వైపు పెద్దగా మొగ్గు చూపకపోవడంతో రైతులు బయట ప్రాంతాల నుంచి చివరకు పశ్చిమ బెంగాల్ కూలీలు బాగా నాట్లు వేస్తారని అక్కడ నుంచి కూలీలను రప్పిస్తున్నారు. స్థానిక కూలీలకు చేతినిండా మెట్ట పంటల్లో పనులు దొరుకుతుండడంతో బురద పనులకు వారు ఆసక్తి చూపడం లేదు. మిరప కాయల కోతలు ప్రారంభం కావడంతో స్థానిక కూలీలంతా అటు వైపు వెళ్తున్నారు. దీంతో వరి నాట్లు వేసేవారు కరువవ్వడంతో ఇతర ప్రాంతాల నుంచి ముఠాలను రప్పిస్తున్నారు. ఇప్పటికే వందలాది కూలీలు మండలంలోని వివిధ గ్రామాలకు చేరుకున్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి

మాచర్ల రూరల్: మన సంస్కృతి సంప్రదాయాలు భావి తరాలకు తెలిసేలా తెలుగు వారందరి పెద్ద పండుగ సంక్రాంతి విశిష్టతను తెలియజేసేలా రంగవల్లుల పోటీలు నిర్వహించిన న్యూటన్స్ కళాశాల యాజమాన్యం, కృషి అమూల్యమైందని ఎక్సైజ్ సీఐ వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేసి ఆమె మాట్లాడారు. భారతదేశంలో మన పండుగలకు ఎంతో విశిష్టత ఉందని, మన పెద్దలు ఆచరించిన పద్ధతులు పండుగలు సైన్స్‌కు దగ్గరగా ఉంటాయని, ఎన్నో ఉదాహరణలు నిరూపించాయని, అలాంటి పండుగలలో సంక్రాంతి పండుగ ఒకటని అన్నారు. ఈ పండుగను నేటి విద్యార్థులకు తెలియజేసేలా మండల, పట్టణంలోని మహిళలందరినీ ఒక్క చోటకి చేర్చి ముగ్గుల పోటీలు నిర్వహించిన న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి కృషి అభినందనీయమన్నారు. రంగవల్లులే కాకుండా భోగి మంటలు వేసి, గంగిరెద్దులను ఊరేగించి, హరిదాసులతో భిక్షాటన చేయించి సంకురాత్రి సంబరాలు నిర్వహించిన తీరు అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జున్నా పద్మావతి, ప్రిన్సిపాల్ జి.జగదీష్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.


గెలుపొందిన విజయలక్ష్మికి నగదు అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ వెంకటరమణ

రోడ్డు సమస్యను పరిష్కరించండి



కారెంపూడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ ప్రజలు రోడ్డుపై వస్తున్న దుమ్ముతో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. కారెంపూడి నుంచి గురజాల వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపుల గ్రామం విస్తరించి ఉంది. రోడ్డుకు సమీపంలో పాఠశాల కూడా ఉంది. ఆర్ అండ్ బీ బీటీ రోడ్డు ఛిద్రమై చాన్నాళ్లు అయింది. కొన్నాళ్లు బీటీ రోడ్డుపై పడిన గుంతలతో ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు రోడ్డుపై లేస్తున్న దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వాహనాలు వెళ్తున్నప్పుడు వస్తున్న దుమ్ము ధూళితో గ్రామస్తులు, పాఠశాలలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా బీటీ రోడ్డు వేయించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.